# తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం

## జిల్లా ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం పిలుపు







సంగారెడ్డి ,మే 06 (వుదయం ప్రతినిధి): తెలంగాణ జన సమితి జిల్లా ప్లీనరీ సమావేశం జిల్లా అధ్యక్షుడు తుల్జా రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు . ఈ సమావేశానికి టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ స ందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కేవలం రాష్ట్ర సాధన కోనమే కాకుండా, ఆత్మగౌరవం, వనరుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం జరిగిన మహా ప్రజా పోరాటమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర ఆధిపత్య శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఏకమై ఉద్యమించారని గుర్తుచేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చకుండా, రాజ్యాంగ విలువలను బలహీనపరుస్తూ కుటుంబ పాలన కొనసాగించిందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీసి, ప్రశ్నించే స్వరాలను అణచివేసిందన్నారు. తెలంగాణలో కొత్త అభివృద్ధి నమూనా తీసుకురావాల్సిన సమయంలో కాంట్రాక్టులు, కమిషన్లు, డబ్బు రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక రాజకీయాలు అవసరమనే లక్ష్యంతోనే 2018 ఏప్రిల్ 29న తెలంగాణ జన సమితి ఏర్పాటైందని తెలిపారు. ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వం కల్పించే ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా టీజేఎస్ పనిచేస్తోందన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన అప్రజాస్వామిక చర్యలను నిరంతరం ప్రశ్నిస్తూ, భూసేకరణ, నిరుద్యోగం, బీసీ రిజర్వేషన్లు, విద్య, వైద్యం, రైతుల సమస్యలు, సింగరేణి పరిరక్షణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక ప్రజా సమస్యలపై పార్టీ పోరాటం కొనసాగించిందన్నారు. నిరంకుశ పాలనను ఓడించేందుకు ప్రజాస్వామ్య పరిరక్షణ దృష్ట్యా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపామని, అయితే ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం అనే లక్ష్యం ఇంకా పూర్తికాలేదన్నారు. బీజేపీ విద్వేష రాజకీయాలను రాష్ట్రంలో విస్తరించే ప్రయత్నం చేస్తోందని, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలు కొనసాగిస్తోందని విమర్శించారు. డా. బి . ర్ . అంబేద్కర్ ఇచ్చిన "చదువు ? బోధించు ? సమీకరించు ? పోరాడు" పిలుపు, తెలంగాణ జాతిపిత కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తితో ప్రజలను సంఘటితం చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. మే 12న జలవిహార్ లో నిర్వహించనున్న తెలంగాణ జన సమితి నాలుగో రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ

**ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈవో, జిల్లా కలెక్టర్**

సంగారెడ్డి, ,మే 06 (వుదయం ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి గురువారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, గోడౌన్ నిర్వహణ, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోడౌన్ సీళ్లను తనిఖీ చేసి, అక్కడ ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా ప్రమాణాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంప వారి సౌజన్యంతో అంబలి వితరణ



దౌల్తాబాద్, మే 7 (వుదయం):వేసవి తీవ్రత అధికంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు చల్లదనాన్ని అందించేందుకు దౌల్తాబాద్‌లో అంబలి వితరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గత మాసంలో శ్రీ బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ మాదంశెట్టి భద్రయ్య ఆధ్వర్యంలో అంబలి వితరణ కార్యక్రమం ప్రారంభమైన విషయం తెలిసిందే. అందులో భాగంగా గురువారం గంప కుటుంబ సభ్యుల సౌజన్యంతో అంబలి వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గంప మల్లేశం గుప్తా జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గంప మమత రవిగుప్త, హరిత వెంకటేష్, సంతోష్, సతీష్ తదితరులు తమ తండ్రి స్మారకార్థంగా ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పలువురు ప్రజలు కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యుల సేవాభావాన్ని అభినందించారు.

## ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

**బ్యాంకు అధికారులతో ఎంపిక ప్రక్రియ నిర్వహణ**



దౌల్తాబాద్,మే 7 (వుదయం):ఎస్సీ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం మండల కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కింద ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అభ్యర్థులు హాజరై తమ దరఖాస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించారు. బ్యాంకు అధికారులు లబ్ధిదారుల అర్హతలు, ప్రతిపాదించిన యూనిట్ల సాధ్యత, ఆర్థిక పరిస్థితులను పరిశీలిస్తూ ఇంటర్వ్యూలు నిర్వహించారు. యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాలని, ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అఫ్జలోద్దీన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, ఎంపికైన వారికి బ్యాంకుల ద్వారా త్వరలోనే రుణాలు మంజూరు అవుతాయని పేర్కొన్నారు.



# ఉర్దూ భాష అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందిగద్దె క్రాంతి కుమార్



విజయవాడ మే 7 వుదయం ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ అధికార భాష అయిన ఉర్దూపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడంతో పాటు యువతకు భాషా ప్రావీణ్యం కల్పించే లక్ష్యంతో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమి రాష్ట్రవ్యాప్తంగా ఈ వేసవి సెలవుల్లో ఉచిత ఉర్దూ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం అశోక్ నగర్ లోని తూర్పు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఉర్దూ ఫ్రీ క్యాంప్‌కు సంబంధించిన పుస్తకాన్ని టీడీపీ నాయకులు గద్దె క్రాంతి కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఉర్దూ భాషకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక స్థానం ఉందని, భాషల పరిరక్షణ మరియు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ఉర్దూ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత ఈ ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమి సిబ్బంది, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు..

# కరీంనగర్ నగర అభివృద్ధికి మహర్దశ.

**మేయర్ అధ్యక్షతన ప్రశాంతంగా ముగిన అత్యవసర సర్వ సభ్య సమావేశం.**

**1150 కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రతిపాధనల ఎజెండా కు పాలకవర్గం ఏకగ్రీవ ఆమోదం.**



కరీంనగర్ మే 7(వుదయం ప్రతినిధి) : నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ అడుగులు వేస్తోంది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అత్యవసర సర్వ సభ్య సమావేశం జరిగింది. నగర అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' పథకం కింద 1,150 కోట్ల నిధుల వినియోగంపై రూపొందించనున్న ప్రతిపాదనలకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ పథకం ద్వారా నగరంలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టుల ప్రతిపాదనల రూపకల్పనపై పాలకవర్గ సభ్యుల సలహాలు సూచనలు స్వీకరించి ప్రాజెక్టులపై సుధీర్ఘంగా చర్చించి ప్రభుత్వానికి పంపె నివేదికలకు తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుండి భారీగా నిధులు సాధించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ పథకం ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ఈ నిధులను సాధించుకొని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగర ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టబోయే ప్రతి ప్రాజెక్టు పారదర్శకంగా, నాణ్యతతో సాగేలా చూస్తామని సమావేశంలో తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల మెరుగుదలకు పాలకవర్గ సభ్యులు ఇచ్చే సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. అర్బన్ చాలేంజ్ ఫండ్ పథకాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ త్వరలో ప్రకటించడంతో ఈ పథకంలో కరీంనగర్ నగరపాలక సంస్థను చేర్చేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 1150 కోట్ల నిధులతో నగరాన్ని మరింత సుందరంగా అభివృద్ధి చేసి విలీన గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ నగర అభివృద్ధి కి పాలకవర్గ సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, ఎస్. ఈ రాజకుమార్, ఈఈ సంజీవ్ కుమార్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



కరీంనగర్ మే 7(వుదయం ప్రతినిధి) : కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదానీను గురువారం అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదానీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలొ ఏ.వో సుధాకర్, తహసిల్దార్ నరేందర్, బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, ఎంఐఎం పార్టీ ప్రతినిది మహ్మద్ మజీద్ హుమైన్, సయ్యద్ ఇబ్రహీం, టిడిపి పార్టీ ప్రతినిది ఎర్రవెల్లి వినీత్, సిపియం పార్టీ ప్రతినిధి నరేష్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## సంగారెడ్డిలో శిశు గృహ, సఖి కేంద్రాల ఆకస్మిక తనిఖీ






సంగారెడ్డి ,మే 06 (వుదయం ప్రతినిధి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవానిచంద్ర గారి ఆదేశాల ప్రకారం ఈ రోజు శిశు గృహ; జువైనల్ జస్టిస్ బోర్డు మరియు సఖి కేంద్రం నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు తనికి నిర్వహించటం జరిగినది. ఈ తనికి లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు మాట్లాడుతూ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సంరక్షణను తోడ్పడాలని అన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాలి అన్నారు. అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని తేలిపారు. విద్యార్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి అన్నారు. సఖి కేంద్రాన్ని సందర్శించే బాధితుల యొక్క సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డ్ నందు బాలల హక్కుల రక్షణ చట్టం పై అవగాహన కల్పించారు. ఎవరికైనా న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డి ని సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి.సౌజన్య గారు మరియు సఖి, శిశు గృహ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళితులను అడ్డుకున్న వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్**



దౌల్తాబాద్ , మే 7 (వుదయం): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో దుర్గమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా దళితులను దేవాలయంలోకి రాకుండా అడ్డుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న ఈ సమయంలో కూడా దళితులను కులం పేరుతో అవమానించడం దురదృష్టకరమన్నారు. ఆధునిక సమాజంలో కుల, మత భేదాలు లేవని చెప్పుకుంటున్నప్పటికీ అనంతసాగర్‌లో జరిగిన ఘటన సమాజానికి చెడు సంకేతాలు ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గమ్మ ఉత్సవాల నిర్వహణకు దళితులు కూడా విరాళాలు అందించినప్పటికీ, వారి బోనాలను దేవాలయంలోకి తీసుకెళ్లకుండా అడ్డుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ ఘటనలో అనంతసాగర్ ఉపసర్పంచ్ కనకయ్యతో పాటు బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బాధిత దళిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని, పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష

**నర్సంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం శ్రీనివాస్.**

**నర్సంపేట వుదయం ప్రతినిధి మే 7.**

నర్సంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు న్యాయస్థానం 3 రోజుల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం బోడ సురేష్ (30), మూడుచెక్కలపల్లి గ్రామం, నల్లబెల్లి మండలం, గుగులోత్ బన్ హిలాల్ (30), సర్వపూర్, నర్సంపేట, శనబోయిన విజయ్ (20), పొగల్ల పల్లి, కొత్తగూడ. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని గురువారం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నర్సంపేట పి. గిరిధర్ ఎదుట హాజరుపరచగా, ముగ్గురికి తలా మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు నర్సంపేట ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. అనంతరం వారిని జైలుకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు హెచ్చరిక జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మృతుని కుటుంబానికి 40 లక్షల ఎక్స్ గ్రేసియా ఇచ్చి ఆదుకోవాలి



**మహబుబాబాద్ /గార్ల మే 7(వుదయం న్యూస్):-**

ఇటీవల అకాల వర్షం గాలి దుమారం కారణంగా గడ్డివాము పై నుండి పడి మృతి చెందిన రైతు సంపత్ కుటుంబానికి 40 లక్షల ఎక్స్ గ్రేసియా ప్రకటించి ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మాజీ వైస్ ఎంపీపీ కట్టే బోయిన శ్రీనివాస్ గురువారం డిమాండ్ చేశారు.అకాల వర్షం పిడుగులతో కూడిన గాలి వానకు గార్ల మండల కేంద్రంలోని పుట్టకోటబజారుకుచెందిన పేద రైతు గడ్డివాముపై నుండి పడి చికిత్స పొందుతూ మృతి చెందారని తెలుసుకున్న సీపీఐ గార్ల మండల సమితి ఆయన మరణం పట్ల దిగ్భంతి వ్యక్తంచేస్తు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ సందర్భంగా కట్టే బోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంపత్ మరణంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్రంగా నష్టపోయినందన్నారు. వారి పిల్లలు అనదలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వారికుటుంబానికి40లక్షలఎక్స్ గ్రేసియా ప్రకటించి ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఖానాపురం నుండి భద్రాచలంకు కాలినడకన మాల విరమణకు బయలుదేరిన స్వాములు



**శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోను హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు.**

**41 రోజు హనుమాన్ స్వాములు కఠిన దీక్షలు.**

**ఖానాపురం, మే 7 (వుదయం ప్రతినిధి):**

హనుమాన్ మాల ధరించిన ఆరుగురు స్వాములు మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోనూ హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకొని తలమీద పెట్టుకొని కాలినడకన ఖానాపురం నుండి వయా మంగళవారిపేట, నాజీతండా, గుంజేడు, కొత్తగూడ, ఇల్లందు, పాల్వంచ, భద్రాచలం వరకు కాలినడకన వెళ్లి ఈ నెల 12న హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ భక్తులు భద్రాచలంలో రాముని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి 41 రోజు కఠిన దీక్షల అనంతరం అంజన్న స్వామి మాల విరమణ చేయడానికి కాలినడకన బయలుదేరి వెళ్లారు. కాలినడకన వెళ్లిన స్వాములు వద్దే వెంకటేష్ స్వామి, మచ్చిక శ్రీధర్ స్వామి, మచ్చిక అఖిల్ స్వామి, రాజేంద్రర్ స్వామి, బిక్షపతి స్వామి, హర్ష స్వామి తరలి వెళ్లారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన పర్సన్ ఇన్చార్జి సొసైటీ చైర్మన్ రామస్వామినాయక్



**ఖానాపురం, మే 7 (వుదయం ప్రతినిది):**

మండలంలోని ధర్మారావుపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కూసా మల్లారెడ్డిఉమా దంపతుల కుమారుని వివాహ రిసెప్షన్ కు సొసైటీ పర్సన్ ఇన్చార్జి చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ హాజరై నూతన వధూవరులు కూస నాగరాజు రెడ్డిమౌనికచంద్ర లపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాద్రాజు వెంకన్న, సొసైటీ పర్సన్ డైరెక్టర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మేకల కుమారస్వామి, నాయకులు పోదరాజు కరుణాకర్, కత్తల వెంకటేశ్వర్ రావు, వెన్ను సమ్మయ్య, మల్యాల మధుకర్ రావు, గండ్ర రాజు, వార్డు సభ్యుడు గూగులోతు శ్రీను, పెండ్లి జనార్ధన్, సౌరబ్ నవీన్, శుభోదన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు పేదలకు వరం లాంటిది




**ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు.**

**ఖానాపురం, మే 7 (వుదయం ప్రతినిధి):**

బడుగు బలహీన వర్గాలకు మధ్యతరగతి కుటుంబాలకు సన్నా చిన్న కారు రైతులకు ఇందిరమ్మ ఇండ్లు వరం లాంటివని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు మండల ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తెలిపారు. మండలంలోని దబ్బీర్ పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పడిదాల సోమేశ్వరరావు ధనలక్ష్మిల నూతన గృహ ప్రవేశానికి హాజరై ఇందిరమ్మ ఇంటిని ఇంటి యజమాలతో కలిసి ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఆత్మ అధ్యక్షుడు యద్ల భిక్షంరెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె ముస్తఫా, మండల సహాయ కార్యదర్శి అన్నమనేని దేవేందర్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు భాషబోయిన రవి, నాయకులు దేవినేని వేణుగోపాల్ రావు, జటంగి నాగరాజు, తాటి పుల్లయ్య, ఇక రమేష్ తదితిరులు పాల్గొన్నారు.

# మే 8 – మానవతా సేవ, రక్తవ్యాధులపై అవగాహనకు ప్రతీకగా మూడు అంతర్జాతీయ దినోత్సవాలు




ప్రతి సంవత్సరం మే 8వ తేదీ ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం (World Red Cross Day), ప్రపంచ థలసేమియా దినం (World Thalassaemia Day) మరియు *సికిల్ సెల్ అవగాహన దినం (Sickle Cell Awareness Day) గా జరుపుకుంటారు. ఈ మూడు దినోత్సవాలు మానవతా సేవ, ఆరోగ్య చైతన్యం, మరియు రక్త సంబంధిత వ్యాధుల నివారణపై సమాజానికి అవగాహన కల్పించడంలో అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నాయి.

ఈ దినోత్సవాలను నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం —

ప్రాణాలను కాపాడటం, బాధితులకు మద్దతు ఇవ్వడం, సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడం.

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం

రెడ్ క్రాస్ డే ఎందుకు జరుపుకుంటారు?

ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ మరియు రెడ్ క్రిసెంట్ సంస్థల సేవలను గౌరవించేందుకు ప్రతి సంవత్సరం మే 8న ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం నిర్వహిస్తారు.

ఈ రోజు ద్వారా:

* మానవతా సేవా భావాన్ని గుర్తు చేస్తారు
* యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, ప్రమాదాల సమయంలో సేవలందించే వాలంటీర్లను సన్మానిస్తారు
* రక్తదానం, ఆరోగ్య సేవలు, సహాయక చర్యలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తారు
* "మతం - కులం - దేశం అనే తేడాలు లేకుండా సేవ చేయాలి" అనే సందేశాన్ని వ్యాప్తి చేస్తారు

రెడ్ క్రాస్‌ను ఎవరు ప్రారంభించారు? రెడ్ క్రాస్ ఉద్యమానికి పునాది వేసిన వ్యక్తి హెన్రీ డ్యునాంట్ (Henry Dunant) అనే స్విట్జర్లాండ్‌కు చెందిన సామాజిక సేవకుడు.

హెన్రీ డ్యునాంట్ గురించి

* జననం : మే 8, 1828
* దేశం : స్విట్జర్లాండ్
* వృత్తి : వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు

1859లో ఇటలీలో జరిగిన సోల్ఫెరినో యుద్ధం సమయంలో వేలాది మంది గాయపడి సహాయం లేక బాధపడుతున్న దృశ్యాలు చూసి ఆయన ఎంతో కలత చెందారు. అప్పుడు ఆయన స్థానిక ప్రజల సహాయంతో గాయపడిన సైనికులకు సేవలు అందించారు. ఆ అనుభవంతో ప్రపంచవ్యాప్తంగా యుద్ధ బాధితులకు సహాయం చేసే ఒక సంస్థ అవసరమని భావించారు.

అదే ఆలోచనతో తరువాత International Committee of the Red Cross (ICRC) ఏర్పడింది.

హెన్రీ డ్యునాంట్ జన్మదినమైన మే 8నే ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

ఆయనకు 1901లో మొదటి నోబెల్ శాంతి బహుమతి లభించింది.

రెడ్ క్రాస్ ప్రధాన లక్ష్యాలు

రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఈ కింది సేవలు అందిస్తోంది:

1. రక్తదాన సేవలు
* రక్తదాన శిబిరాలు నిర్వహించడం
* రక్తనిధి కేంద్రాల్లో రక్త నిల్వలు ఏర్పాటు చేయడం
* అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం

.2 విపత్తు సహాయక చర్యలు
* వరదలు
* భూకంపాలు
* తుఫానులు
* అగ్ని ప్రమాదాలు

ఇలాంటి సమయంలో ఆహారం, మందులు, తాత్కాలిక ఆశ్రయం కల్పించడం.

. 3 ఆరోగ్య సేవలు
* ప్రథమ చికిత్స శిక్షణ
* ఆరోగ్య శిబిరాలు
* తల్లిశిశు సంక్షేమ కార్యక్రమాలు

4. మానవతా సేవ
* అనాథలు
* వృద్ధులు
* దివ్యాంగులు
* యుద్ధ బాధితులకు సహాయం

ప్రపంచ థలసేమియా దినం

థలసేమియా అంటే ఏమిటి?

థలసేమియా ఒక వారసత్వ రక్త వ్యాధి. ఈ వ్యాధి ఉన్నవారిలో శరీరంలో సరిపడా హీమోగ్లోబిన్ తయారు కాదు.

* రక్తహీనత
* అలసట
* ఎదుగుదలలో సమస్యలు
* గుండె, కాలేయ సమస్యలు రావచ్చు.

థలసేమియా బాధితులకు తరచూ రక్త మార్పిడి అవసరం అవుతుంది.

థలసేమియా డే ఎందుకు జరుపుకుంటారు? ప్రపంచవ్యాప్తంగా థలసేమియా వ్యాధిపై అవగాహన పెంచడం కోసం ఈ దినాన్ని నిర్వహిస్తారు.

ఈ రోజు ముఖ్య ఉద్దేశాలు:

* వ్యాధి గురించి ప్రజలకు తెలియజేయడం
* ముందస్తు రక్త పరీక్షల ప్రాముఖ్యత చెప్పడం
* బాధితులకు మద్దతు ఇవ్వడం
* రక్తదానాన్ని ప్రోత్సహించడం

థలసేమియా నివారణ ఎలా?

వివాహానికి ముందు రక్త పరీక్షలు

ఇద్దరిలో థలసేమియా లక్షణం ఉంటే పిల్లలకు వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది.

జన్యు సలహా

డాక్టర్ల సలహా తీసుకోవడం అవసరం.

నిరంతర రక్తదానం

థలసేమియా పిల్లలకు ప్రతి నెల రక్తం అవసరం అవుతుంది.

సికిల్ సెల్ అవగాహన దినం

సికిల్ సెల్ వ్యాధి అంటే ఏమిటి?

సికిల్ సెల్ ఒక జన్యుపరమైన రక్త వ్యాధి. సాధారణంగా ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటాయి. కానీ ఈ వ్యాధిలో అవి కొడవలి (Sickle) ఆకారంలో మారిపోతాయి.

* రక్తప్రసరణ సరిగా జరగదు
* శరీరానికి ఆక్సిజన్ తక్కువగా చేరుతుంది
* తీవ్రమైన నొప్పులు వస్తాయి
* ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి

సికిల్ సెల్ అవగాహన దినం ఎందుకు?

ఈ వ్యాధి గురించి సమాజంలో అవగాహన పెంచడం కోసం ఈ దినాన్ని నిర్వహిస్తారు.

ప్రత్యేకంగా:

* గిరిజన ప్రాంతాల్లో అవగాహన కల్పించడం
* ముందస్తు పరీక్షలు చేయించడం
* సరైన వైద్యం అందించడం
* కుటుంబాల్లో జాగ్రత్తలు తీసుకోవడం

యువత పాత్ర ఎంతో ముఖ్యము

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది.

యువత ముందుకు వచ్చి:

* రక్తదానం చేయాలి
* ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలి
* థలసేమియా, సికిల్ సెల్‌పై అవగాహన కల్పించాలి
* సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రతి రక్తదాతకు వందనాలు

స్వచ్ఛంద రక్తదానం చేసే ప్రతి వ్యక్తి ఒక ప్రాణరక్షకుడు.

"ఒక్క యూనిట్ రక్తం - అనేక ప్రాణాలకు జీవనాధారం"

థలసేమియా పిల్లలు, ప్రమాద బాధితులు, శస్త్రచికిత్స రోగులు — అనేక మంది రక్తదాతల వల్ల కొత్త జీవితం పొందుతున్నారు.

సమాజానికి సందేశం

"మానవ సేవే మహా సేవ - రక్తదానం మహాదానం"

మే 8 మనకు మానవత్వం, సేవా భావం, ఆరోగ్య చైతన్యం అనే గొప్ప విలువలను గుర్తు చేస్తుంది.

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ థలసేమియా దినం, సికిల్ సెల్ అవగాహన దినోత్సవాలు మనందరికీ ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తున్నాయి —

ప్రాణాలను కాపాడటం మనందరి బాధ్యత. స్వచ్ఛంద రక్తదానం, అవగాహన, యువత భాగస్వామ్యం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.



**- ఇ.వి. శ్రీనివాస్ రావు**
**రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు**

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి 15 రోజుల గడువు పెట్టిన మున్సిపాలిటీ.



**మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్.**

**నర్సంపేట వుదయం ప్రతినిధి మే 7.**

నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ శాఖ మరియు ఏ ఎస్ ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన కప్పులు, గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు, స్ట్రాలు, 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న క్యారీ బ్యాగులను పూర్తిగా నిషేధించాలని సూచించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు పెరుగుతోందని తెలిపారు. 15 రోజుల్లోగా హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయాలని, లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఫంక్షన్ హాల్స్‌లో ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా సిరామిక్ ప్లేట్లు, గాజు గ్లాసులు వినియోగించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం బయో కవర్లు వినియోగించాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏ ఎస్ అర్ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, హోటల్, ఫంక్షన్ హాల్, ప్లాస్టిక్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలి



**బీజేపీ మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్ యాదవ్ పిలుపు.**

**నర్సింహులపేట, మే 7 (వుదయం ప్రతినిధి):**

ప్రధానమంత్రి మోడీ సభను విజయవంతం చేయాలి బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సూరబోయిన సతీష్ యాదవ్.

ఈ నెల 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.గురువారం ఆయన మాట్లాడుతూ మండలం నుంచి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ప్రధాని మోడీ నాయకత్వం కీలకమని పేర్కొన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న సభకు ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పురాతన ఆలయం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**తెలంగాణ రక్షణ సేన నర్సంపేట బాధ్యులు డాక్టర్ బోడ అనిల్ కుమార్.**

**ఖానాపురం, మే 7 (వుదయం ప్రతినిధి):**

పురాతన ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మరల ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ జరగకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన నర్సంపేట బాధ్యులు డాక్టర్ బోడ అనిల్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అశోక్ నగర్ గ్రామ శివారులోని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కాకతీయుల కాలంలో ప్రతాపరుద్రుడు నిర్మించిన పురాతన శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని సంబంధిత కాంట్రాక్టర్ జెసిపిలతో పురాతన ఆలయాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటని తెలుపుతూ, పురాతన ఆలయాన్ని ధ్వంసం చేసిన సంబంధిత కాంట్రాక్టర్ పై స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, సంబంధిత దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చారిత్రక ఆలయ పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాకతీయుల కాలంలో నిర్మాణం చేసిన చారిత్రక ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు.చరిత్రను గౌరవించనివారే ఇలాంటి సంఘటనలకు పాల్పడతారని తెలుపుతూ, కాకతీయుల చరిత్రకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని తెలుపుతూ అలాంటి చారిత్రక వారసత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. గతంలో కూడా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పనుల కోసం వినియోగించాలనే ఆలోచనలు వచ్చినప్పటికీ చారిత్రక ఆలయం ఉన్నందున ఆ ప్రయత్నాలను విరమించుకున్నారని గుర్తు చేశారు. 1213 సంవత్సరంలో నిర్మించబడిన ఈ పురాతన ఆలయం కాకతీయ కళాసంపదకు ప్రతీక అని, అలాంటి నిర్మాణాన్ని కూల్చివేస్తుంటే పురావస్తు శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్కియాలజీ శాఖ అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో చారిత్రక ప్రాంతాలను ధ్వంసం చేయడం అవివేకమని కాంట్రాక్టర్ల లాభాల కోసం స్థానిక నాయకుల కమిషన్ల కోసం చరిత్రను నాశనం చేయవద్దని హెచ్చరించారు. కాకతీయుల కాలంలో ఈ ఆలయం నుంచి ఖిల్లా వరంగల్ వరకు సొరంగ మార్గాలు ఉన్నాయని చరిత్ర చెబుతోందని పేర్కొంటూ ఇలాంటి పురాతన ఆలయాలను పరిరక్షించాలి తప్ప కూల్చవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నర్సంపేట నాయకులువినోద్, మహేందర్, కిరణ్, నరేష్, బన్నీ, నరసింహ, మంగ్య, మహేష్, అభిరామ్, రాజేష్, తేజు, జంపన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మాగ్రహ దీక్ష కు పిలుపునిచ్చిన డా గోగుల రాణా ప్రతాప్ రెడ్డి.



**నర్సంపేట వుదయం ప్రతినిధి మే 7.**

నర్సంపేట డివిజన్ ఖానాపూర్ మండలం అశోక్ నగర్‌లోని మట్టి కోట వద్ద ఉన్న పురాతన శివాలయాన్ని కూల్చివేయడంపై హిందూ సమాజంలో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోందని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలయ పునర్నిర్మాణం, ఆలయ భూముల పరిరక్షణ, పురావస్తు సంపద సంరక్షణ కోసం 08052026 శుక్రవారం ఉదయం 10 గంటలకు అశోక్ నగర్ మట్టి కోటలోని కూల్చిన శివాలయ స్థలంలో ధర్మాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సుమారు 700 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ శివాలయం కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి కాలంలో నిర్మించబడిందని, ఇది కేవలం ఆధ్యాత్మిక క్షేత్రం మాత్రమే కాకుండా మన సంస్కృతి, చరిత్ర, వారసత్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో ఆలయాన్ని తొలగించడం బాధాకరమని పేర్కొన్నారు. అభివృద్ధికి తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే అభివృద్ధి జరగాలని డా. రాణా ప్రతాప్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆలయానికి చెందిన 14 ఎకరాల భూమిని పరిరక్షించి, కూల్చిన ప్రాంతంలోనే ఆలయాన్ని పునర్నిర్మించాలని, ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మరో ప్రభుత్వ స్థలానికి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాంతియుత దీక్ష, శివునికి ప్రత్యేక ప్రార్థనలు, ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజలు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, హిందూ సంఘాల నాయకులు, భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలియజేయాలని డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. మన చరిత్రను, సంస్కృతిని, ఆలయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు.


# కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర



**వుదయం, టేకుమట్ల:**

మండల కేంద్రానికి చెందిన హనుమాన్ మాల ధారణ స్వాములు ఈర్ల కుమార్, తిప్పనవేని యుగేందర్, ఓదెల రాజు వేములవాడ-కొండగట్టు కు పాదయాత్ర ద్వారా పయనమయ్యారు.మండల కేంద్రంలోని శివ రామాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.ఆంజనేయ స్వామి ఆశీస్సులతో తమ పాదయాత్ర సజావుగా కొనసాగుతుందని స్వాములు తెలిపారు. మార్గ మధ్యలో వివిధ దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటూ యాత్రను కొనసాగిస్తామని చెప్పారు. గతంలో కూడా ఇదే విధంగా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

# ఎల్.ఆర్.ఎస్.ఫీజు చెల్లింపులపై 25శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలి




అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.

కరీంనగర్ మే 7(వుదయం ప్రతినిధి) :

అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్.ఆర్.ఎస్ 2020) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఎల్.ఆర్.ఎస్. పెండింగ్ దరఖాస్తులపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ ఫీజు, ఇతర ఛార్జీల చెల్లింపుపై 25 శాతం రాయితీ ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 131 జారీ చేసిందని పేర్కొన్నారు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకుని, ఇంకా ఫీజు చెల్లించని వారు లేదా పాక్షికంగా చెల్లించిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. 25 శాతం ఫీజు రాయితీ కేవలం మే 1, 2026 నుండి జూలై 31, 2026 వరకు చెల్లించే వారికి మాత్రమే వర్తిస్తుందని, ఈ రాయితీ ద్వారా ప్లాట్ యజమానులు తక్కువ మొత్తంతో తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవచ్చని పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ వల్ల భవిష్యత్తులో రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణాలు, నిర్మాణ అనుమతులు పొందడం సులభతరమవుతుందని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్2020 దరఖాస్తుదారులు గడువులోపు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించి, ప్రభుత్వం కల్పించిన ఈ భారీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్ఆర్ఎస్ రాయితీ పై దరఖాస్తుదారులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు జమ్మికుంట చొప్పదండి హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్లు ఎల్ఆర్ఎస్ రాయితీ పథకంపై హెల్ప్ డేస్కులు ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో కరీంనగర్ హుజురాబాద్ జమ్మికుంట చొప్పదండి మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ తదితరులు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ క్షేత్ర పర్యటన





**అకాల వర్షా లకు తడిసిన ధాన్యం రైతులకు భరోసా...**

**జగిత్యాల మే 07 (వుదయం ప్రతినిధి )**

గురువారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలంలోని తక్కలపల్లి పోలాస కల్లేడ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా పర్యటించారు జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలు కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని స్వయంగా పరిశీలించిన కలెక్టర్ బి సత్యప్రసాద్ తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలించారు అక్కడికక్కడే రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఈ సందర్భంగా కలెక్టర్ బి సత్యప్రసాద్ కీలక సూచనలు చేశారు ధాన్యం కుప్పలపై వెంటనే టార్పాలిన్లు కప్పాలని కల్లాల చుట్టూ నీరు నిలవకుండా కాల్వలు తవ్వాలని తడిసిన ధాన్యాన్ని విడిగా ఆరబెట్టే ఏర్పాట్లు చేసుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు

**రైతులకు ఇచ్చిన భరోసా:**

ఒక్క రైతు కూడా అధైర్య పడవద్దు వర్షానికి తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందనీ కలెక్టర్ బి సత్య ప్రసాద్ స్పష్టం చేశారు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ రెవెన్యూ జిల్లా పౌరసరఫరాల అధికారి వ్యవసాయ శాఖ ఏడిలకు ఆదేశాలు జారీ చేశారు

ప్రతి కొనుగోలు కేంద్రంలో డ్రయ్యర్లు ఫ్యాన్లు క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని తెలిపారు తడిసిన ధాన్యం వల్ల రైతుకు ఒక్క రూపాయి కూడా నష్టం జరగదని ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు